క్లుప్తంగా

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం

తిరువూరు: పునర్నిర్మించిన తిరువూరు శ్రీరంగ నాయకస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం కృష్ణ సుదర్శన హోమం నిర్వహించారు. వేదపండితులు రామకృష్ణస్వామి ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రంగారావు పర్యవేక్షించారు.

ఎంఈఓగా రామకృష్ణ

తిరువూరు: తిరువూరు మండల విద్యాశాఖాధికారిగా విస్సన్నపేట ఎంఈఓ చదల రామకృష్ణ సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు గంపలగూడెం ఎంఈఓ సోమశేఖర నాయక్ తిరువూరు మండల విద్యాశాఖాధికారిగా వ్యవహరిస్తుండగా, ఆయన స్థానంలో రామకృష్ణ నియమితులయ్యారు.

కబడ్డీ పోటీల్లో పీఈటీకి పతకాలు



తిరువూరు: మండలంలోని ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ డీ లక్ష్మి ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ కబడ్డీ పోటీల్లో ఏపీ జట్టు తరఫున పాల్గొని రజత పతకం సాధించారు. అఖిలభారత సర్వీసు ఉద్యోగుల జాతీయ కబడ్డీ పోటీలలో ఈ పతకం లభించింది. మిడ్నపూర్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పరుగు పందెం, షాట్‌పుట్‌లో రజత, కాంస్య పతకాలను సాధించిన లక్ష్మిని పాఠశాల హెచ్‌ఎం కేశవరావు సోమవారం అభినందించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జి.కొండూరు: మండలంలోని కవులూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు సోమవారం తెలిపారు. అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

నేడు, రేపు పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను-1 సచివాలయం పరిధిలో మంగళ, బుధవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, ఎంపీపీ గోగుల మూడి శ్రీలక్ష్మి తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణ నిధి పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు కోరారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై అవగాహన

మైలవరం: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతిక అభ్యున్నతికి ప్రయోజనం అని సీడీఏసీ జాయింట్ డైరెక్టర్ శ్రీకృష్ణ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐఈఈఈ, సీడీఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై సోమవారం అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సు ఐదు రోజుల పాటు జరుగనుంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరనాథరెడ్డి పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ

తిరువూరు: తిరువూరులోని రాజ్యలక్ష్మి సమేత రంగనాయకస్వామి దేవస్థానానికి దాతలు 17 కిలోల ఇత్తడి కుందులను సోమవారం విరాళమిచ్చారు. తిరువూరుకు చెందిన శేషా చలపతి రావు కుటుంబసభ్యులు ఈ కుందులను ఆలయ ధర్మకర్త రంగారావుకు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి

రాజవరం(గంపలగూడెం): తర, తమ భేదం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలను-2 సచివాలయ పరిధిలోని రాజవరం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రక్షణనిధి గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 234 కుటుంబాలు ఉన్న గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల కింద రూ.3.09 కోట్లను ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలో జమ చేసిందన్నారు. మరో 14 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులు మరికొంత లబ్ధిని పొందుతారన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర పరిధిలో మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గ్రామస్తులు విజ్ఞప్తి మేర సచివాలయం నిధులు రూ.5లక్షలతో ఆర్వో ప్లాంట్ నిర్మించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నుపాటి నరసింహారావు, ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషగిరి రావు, ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు చెన్నకేశవ రెడ్డి, నరసారెడ్డి, ఉమా, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, బాలు, ముత్తయ్య, కోటేశ్వరరావు, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



రాజవరంలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రక్షణనిధి

సంక్షేమ స్వర్ణయుగంగా సీఎం జగన్ పాలన

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

రెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్ర చరిత్రలో సంక్షేమ స్వర్ణయుగంగా నిలిచిపోతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని మద్దులపర్వ సచివాలయం పరిధిలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో కలసి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని, సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మైలవరం మార్కెట్‌యార్డు చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి, రెడ్డిగూడెం సచివాలయ మండల కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, ఎంపీటీసీ సభ్యులు ధనలక్ష్మీ, వరప్రసాద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, వీరస్వామినాయుడు, పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

సంక్షిప్తం

■ రైతుల సంక్షేమం కోసం పని చేయాలి

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వారికి తెలియజేస్తూ, రైతు సంక్షేమం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన జొన్నలగడ్డ గంగాధరరావును సోమవారం సత్కరించారు. చంద్రాల గ్రామంలో గంగాధరరావు ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, దీనిని గుర్తించే నాయకత్వం ఆయనకు పదవి కట్టబెట్టిందన్నారు. గంగాధరరావు మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

■ నేడు మున్సిపల్ సమావేశం

నూజివీడు: స్థానిక పురపాలక సంఘం సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణీ దుర్గ అధ్యక్షతన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

■ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కృషి

ఆగిరిపల్లి: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తమ కళాశాల పాటుపడుతోందని ఎస్‌ఆర్‌ఐ కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు అన్నారు. మండలంలోని పోతవరప్పాడులో ఎస్ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయస్థాయి సదస్సు సన్‌రైజ్-2023ను చైర్మన్ ప్రారంభించారు.

■ రైతులకు అండగా సీఎం జగన్

ఆగిరిపల్లి: రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని ఈదులగూడెంలో రూ.34.25లక్షలతో నిర్మించనున్న పీఏసీఎస్ భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే ప్రతాప్, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు ఎకరాలు ఉన్న రైతులకు రూ.25 లక్షల వరకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఆగిరిపల్లిలోని కేడీసీసీబీ బ్రాంచిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎంను ఎమ్మెల్యే ప్రతాప్, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, కేడీసీసీబీ డైరెక్టర్లు భూక్యా రాణి, శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సాంబశివరావు, ఆగిరిపల్లి కేడీసీసీబీ బ్రాంచి మేనేజర్ కే మరియమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు హరిబాబు పాల్గొన్నారు.

■ విజ్‌డమ్ స్కూల్‌ను పరిశీలించిన డీఈఓ

నూజివీడు: గోడ కూలి విద్యార్థి మృతిచెందిన ఘటనలో విజ్‌డమ్ స్కూల్‌ను ఏలూరు డీఈఓ ఎన్‌వీ రవిసాగర్ సోమవారం సందర్శించి గోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఎల్‌కేజీ చదువుతున్న నీల మణికంఠ గోడకూలి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.రవిని అడిగి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. అనంతరం సెయింట్ థామస్, సెయింట్ ఆన్స్, ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లోని బాత్‌రూమ్‌లు, తరగతి గదులను తనిఖీ చేశారు.

■ ఉత్తమ ఫలితాలు సాధించాలి

చాట్రాయి: కష్టపడి ఇష్టపడి చదివితే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మండలంలోని చనుబండ జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం మోరంపూడి సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీలో ఆయన పాల్గొన్నారు.

■ ఓటర్ల జాబితా ప్రదర్శన

చాట్రాయి: గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవరం ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. గ్రామ పంచాయతీ 5వ వార్డు ఉప ఎన్నిక త్వరలో జరగనున్నందున ప్రజలకు ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రదర్శించినట్లు ఈఓపీఆర్డీ నాగరాజు తెలిపారు.

■ దేవరగుంటలో డ్రోన్ సర్వే ప్రారంభం

నూజివీడు: మండలంలోని దేవరగుంటలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సోమవారం భూముల డ్రోన్ సర్వేను ఎంపీటీసీ సభ్యుడు నక్కా శ్రీనివాస రావు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పల్నాటి రఘురాం, చలపతిరావు, మాజీ సర్పంచ్ చంద్ర శేఖర్, వీఆర్వో ఏ.కుమారి, సచివాలయ సర్వేయర్ అయ్యప్ప పాల్గొన్నారు.

■ వడ్డెరల అభివృద్ధికి సీఎం కృషి

నూజివీడు: వడ్డెరల సంక్షేమానికి, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఏపీ వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి అన్నారు. పట్టణంలోని గొడుగువారిగూడెంలో సోమవారం పర్యటించారు. దీనిలో భాగంగా స్థానిక వడ్డెర ప్రజలతో సమావేశమై వారి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడ్డెరల అభివృద్ధికి వడ్డెర కార్పొరేషన్ కూడా పనిచేస్తోందన్నారు. ఇటీవల 11మంది బీసీలకు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చిందని, దీనిని బట్టే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యం అర్థమవుతుందన్నారు. బీసీలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు రంజిత్‌కుమార్(జిత్తు), వడ్డెర సంఘం నాయకుడు బండారు సత్యనారాయణ పాల్గొన్నారు.

■ గైర్హాజరైన బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు

విజయవాడరూరల్: ఓటరు కార్డుకు అనుసంధానం చేసే విధులకు ఆదివారం గైర్హాజరైన పోలింగ్ బూత్ ఆఫీసర్లకు సహాయ ఎన్నికల నమోదు అధికారి, రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవి సోమవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఓటరుకార్డుకు ఏదైనా గుర్తింపు కార్డుతో అనుసంధానం చేసే ప్రక్రియను కొందరు బీఎల్‌ఓలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గ పరిధిలో 20 మందికి, మైలవరం నియోజకవర్గం పరిధిలో ఎనిమిది మంది బీఎల్‌ఓలకు తహసీల్దార్ షోకాజ్ నోటీసులను జారీచేశారు. నోటీసులు అందిన 24 గంటల్లో బీఎల్‌ఓలు సమాధానమివ్వాలని ఆదేశించారు.

■ లేఅవుట్ల ఏర్పాటుకు భూముల పరిశీలన

జి.కొండూరు: జగనన్న కాలనీ లేఅవుట్‌ల ఏర్పాటుకు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఎంపిక చేసిన స్థలాలను సబ్‌కలెక్టర్ అదితీసింగ్ సోమవారం పరిశీలించారు. మండలంలోని చెవుటూరు, గుర్రాజుపాలెం, మునగపాడు గ్రామాలలోని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు భూములను కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయా గ్రామాలలో ఎంపిక చేసిన భూములను పరిశీలించిన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం భూములను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ రోహిణీదేవి, ఆర్ఐ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

■ వెల్వడం అభివృద్ధికి ఎన్నారైల కృషి

వెల్వడం(మైలవరం): వెల్వడం గ్రామాభివృద్ధికి ప్రవాసాంధ్రులు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం వెల్వడంలో ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి సౌజన్యంతో రూ.50 లక్షలతో నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత, ఎల్‌బీఆర్‌సీఈ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు.

■ అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 13 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వంగా వ్యవహరించొద్దని, అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడీఏ విద్యాసాగర్, డీఎల్‌పీఓ వెంకటరత్నం, ఉద్యానవనాధికారి ఆర్.హేమ, ఏపీసీపీడీసీఎల్ డీఈ దుర్గారావు, పీపీ యూనిట్ వైద్యాధికారి గంగాధర కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ఇబ్రహీంపట్నం: సైన్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక మెరిడియన్ పాఠశాల కరస్పాండెంట్ పి.శ్రీధర్‌రెడ్డి సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెరిడియన్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో పలువురిని ఆకర్షించింది. ఆయన మాట్లాడుతూ సైన్స్‌పైనే ఆరోగ్య, సామాజిక అంశాలు ఆధారపడి ఉన్నాయన్నారు. సైన్స్ విభాగంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. కృత్యాధార వివరణ, ప్రయోగాలు, విద్యుత్ ఉపయోగ పరికరాలు, సౌర్యమండలం, పౌష్టికాహారం, గృహాల నమూనా మానవుని జీర్ణ వ్యవస్థ తదితర ప్రయోగాలు విద్యార్థులు ప్రదర్శించారు.

2న మండల పరిషత్ సమావేశం

ఇబ్రహీంపట్నం: మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మార్చి రెండో తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ సోమవారం తెలిపారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పరిపాలనా అంశాలపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

'స్పందనలో నాలుగు అర్జీలు

గంపలగూడెం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో మొత్తం నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈఓపీఆర్డీ బాబురావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గజ్జెలు, డ్రస్సు ఇవ్వాలని వినతి

విస్సన్నపేట: డప్పు కళాకారులకు గజ్జెలు, డ్రస్సు, డప్పు ఇవ్వాలని డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి మల్లవరపు కుటుంబరావు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణకు డప్పు కళాకారుల జిల్లా నాయకుడితో పాటు కేవీపీఎస్ జిల్లా నాయకుడు జ్ఞానరత్నం, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు వినతిపత్రం అందజేశారు.

అజాద్‌కు ఘన నివాళి

కొండపర్వ (విస్సన్నపేట): స్వాతంత్ర సమర యోధుడు చంద్రశేఖర్ అజాద్ వర్ధంతి కార్యక్రమం మండలంలోని కొండపర్వ ఎంపీయూపీ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. చంద్రశేఖర్ అజాద్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అజాద్ సేవలు గురించి పాఠశాల హెచ్‌ఎం జయరామ్ విద్యార్థులకు వివరించారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: పేదలకు పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనాలున్నారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. బలివే సచివాలయ పరిధిలోని యల్లాపురంలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలో ప్రజలకు మంజూరైన పింఛన్‌లు, అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, వాహన మిత్ర తదితర పథకాలను వివరించారు. రబీ సాగుకు నీటి ఎద్దడి నివారించేందుకు తమ్మిలేరు కాలువ ద్వారా లోపూడి, గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం, బలివే, వేల్పుచర్ల గ్రామాల్లోని చెరువులను నింపామన్నారు. జరుగుతున్న అభివృద్ధి, పథకాలను అందరూ గుర్తించి, జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, ఎంపీపీ కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ కె.రాజానాయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ జలగం శేషగిరిరావు, బలివే సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఎంపీటీసీ రాటాలు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.



యల్లాపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

కేడీసీసీ బ్యాంకు భవన నిర్మాణానికి శంకుస్థాపన

చాట్రాయి: రైతుల సంక్షేమం కోసం కేడీసీసీ బ్యాంకులు చేస్తున్న సేవలు అభినందనీయమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని చాట్రాయిలో రూ.96 లక్షలతో నిర్మించే కేడీసీసీ బ్యాంకు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలు అందించడంలో కేడీసీసీ బ్యాంకు అగ్రస్థానంలో ఉందన్నారు. ఓటీఎస్ పత్రం ద్వారా లబ్ధిదారులకు బ్యాంకుల్లో రుణాలు ఇస్తున్నారని చెప్పారు. సహకార సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పథకాలు రాజకీయాలకతీతంగా అమలు చేస్తుంటే తట్టుకోలేక చంద్రబాబుకి మతిపోతుందని విమర్శించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూ.36 కోట్ల నికర లాభాలు ఆర్జిస్తూ రూ.10 వేల కోట్ల టర్నోవర్ చేస్తుందని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు తెలిపారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ.75 లక్షల రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ దామెర ఉష, ఎంపీటీసీ శివకుమారి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ పాడిరైతు కుటుంబానికి రూ.50 వేల సాయం

నెమలి(గంపలగూడెం): నెమలి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యురాలు తెల్లబొయిన మంగమ్మ మరణించడంతో కుటుంబ సభ్యులకు క్షీరబంధు పథకంలో రూ. 50 వేల చెక్కును సోమవారం అందజేశారు. తిరువూరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ టి.సాంబమూర్తి సంఘ అధ్యక్షుడు కాపూరి అరవిందమ్మ చెక్కును మృతురాలి భర్త వెంకయ్యకు అందజేశారు. ఏఎంపీఓ ఆర్.వరప్రసాద్, వేతన కార్యదర్శి కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

■ గోదాముకు శంకుస్థాపన

రెడ్డిగూడెం: రైతులు తాము పండించిన పంటలను నిల్వ చేసుకోవటానికి గోడౌన్లు ఎంతగానో దోహదపడతాయని రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని రంగాపురంలో రూ. 15లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గోదాముకు జెడ్పీటీసీ సభ్యుడు విజయ భాస్కరరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రంగాపురం సర్పంచ్ సునీల, వైస్ ఎంపీపీ రాబర్టు, ఎఫ్‌పీఓ అధ్యక్షులుసత్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, రెడ్డిగూడెం సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

■ యువ రైతుకు న్యాయం చేస్తాం

ముసునూరు: ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించిన యువరైతుకు న్యాయం జరిపిస్తామని నూజివీడు ఏడీఏ విద్యాసాగర్ పేర్కొన్నారు. యువరైతు ఆత్మహత్యా యత్నానికి దారి తీసిన మొక్కజొన్న పంటను మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, నూజివీడు టెక్నికల్ ఏఓ కె.సూరిబాబు, ఇతర అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. నూజివీడు మండలం పోలసానపల్లికి చెందిన యువరైతు వేముల వెంకటరావు కౌలు వ్యవసాయం చేస్తూ పంట దిగుబడి రాకపోవడంతో ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంకటరావు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను సోమవారం పరిశీలించారు. విత్తన కంపెనీ ఆర్గనైజర్‌తో చర్చించిన అనంతరం యువరైతుకు న్యాయం జరిపిస్తామని హామీ ఇచ్చారు.

■ పొదుపు అలవాటు చేసుకోవాలి

తిరువూరు: విద్యార్థులు డబ్బులు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని రాజుపేట భారతీయ స్టేట్ బ్యాంకు మేనేజర్ అనిల్ సాగర్ సూచించారు. సిద్దార్థ స్కూల్లో సోమవారం విద్యార్థులకు బ్యాంకు ఖాతాలను ప్రారంభించి పాస్‌బుక్‌లను అందజేశారు. కరస్పాండెంట్ చక్రపాణి పాల్గొన్నారు.

■ జామాయిల్ ప్లాంటేషన్‌లో మంటలు

నూజివీడు: బత్తులవారిగూడెంలో ఉన్న అటవీ శాఖకు చెందిన జామాయిల్ ప్లాంటేషన్‌లో సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఇక్కడ చెత్త పేరుకుపోవడంతో ఆకతాయిలు సిగిరెట్ తాగి పడేశారు. దీంతో మంటలు చెలరేగి ఉంటాయని అటవీశాఖ సిబ్బంది భావిస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పివేసినట్లు ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు.

■ ఘనంగా సిలువగట్టు పుణ్యక్షేత్రం తిరునాళ్ల

నూజివీడు: సిలువగట్టు పుణ్య క్షేత్రం తిరునాళ్లలో భాగంగా సోమవారం రాత్రి దివ్యబలిపూజ నిర్వహించారు. విజయవాడ మేత్రాసనం మోన్సిగ్నోర్స్ రెవ ఫాదర్ మువ్వల ప్రసాద్, రెవ ఫాదర్ పల్లి పాము గాబ్రియేల్ పాల్గొని సమష్టి దివ్య బలి పూజ సమర్పించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కోకిలంపాడు(తిరువూరురూరల్): జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా మండలంలోని కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగాలను ప్రధానోపాధ్యాయుడు గుప్తా వివరించారు. క్విజ్ పోటీలలో విజేతలకు మంగళవారం బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.